ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

గురువారం 11 డిసెంబరు 2025



పెండింగ్ చలానాలు చెల్లించాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్

శ్రీకాకుళం లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలను ఈ నెల 13న జరగనున్న లోక్ అదాలత్‌లో వాహనదారులు చెల్లించి, కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై రాష్ట్రంలో మొత్తం 10,60,172కేసులకు సంబంధించి ఈ-చలానాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించుకోడానికి లోక్ అదాలత్ చక్కని వేదిక అని ఆయన తెలిపారు.

గ్రామీణ రోడ్లకు రూ.100 కోట్లు



మంజూరైన పనులు **67**

రోడ్ల పొడవు **213.12** కిలోమీటర్లు

కేటాయించిన బడ్జెట్ రూ. **100.28** కోట్లు

● 67 రహదారుల పనులకు అనుమతి

● నిధులు కేటాయించిన ప్రభుత్వం

శ్రీకాకుళం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ పట్టింది. దెబ్బతిన్న రోడ్లను బాగుచేసేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ఏపీ రూరల్ రోడ్స్ స్ట్రెంథనింగ్ ప్రాజెక్టు (ఏపీఆర్ఆర్ ఎస్‌పీ-ఫేజ్ 1)కింద రూ.100 కోట్లతో 67 రహదారుల పనులు చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో జిల్లాలో గ్రామీణ రవాణా వ్యవస్థ మెరుగుపడనుందని.. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ వీరన్నాయుడు తెలిపారు.

ఆమదాలవలస నియోజకవర్గం..

● **పొందూరు:** కింతలి బొడ్డేపల్లి ఆర్అండ్ బీ రోడ్డు నుంచి ఎన్‌హెచ్-16 వరకు(సింగూరు మీదుగా) రూ.2.70 కోట్లు. పెనుబర్తి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి తోలాపి వరకు రూ.1.73 కోట్లు.

● **ఆమదాలవలస:** కలపర్తి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బొబ్బిలిపేట వరకు రూ. 2.16 కోట్లు

● **బూర్జ:** సీఎస్‌పీ రోడ్డు నుంచి బొమ్మిక వరకు రూ. 1.48 కోట్లు.

ఎచ్చెర్ల నియోజకవర్గం..

● **రణస్థలం:** ఎన్‌హెచ్-16 నుంచి పాతర్లపల్లి పోతయ్యపేట వరకు రూ. 2.77 కోట్లు.

● **ఎచ్చెర్ల:** తోటపాలెం నుంచి మత్స్యలేశం వరకు (ముద్దాడ రామోజీపేట మీదుగా) రూ. 3.10 కోట్లు. పొన్నాడ నుంచి కమ్మపేట వరకు రూ. 2.13 కోట్లు.

● **లావేరు:** పాతఎన్‌హెచ్-5 నుంచి కృష్ణాపురం వరకు రూ. 1.43 కోట్లు.

● **జి.సిగడాం:** పాగిరి ఆర్అండ్‌బీ జంక్షన్ నుంచి వీపీ రోడ్డు వరకు రూ. 1.58 కోట్లు.

ఇచ్ఛాపురం నియోజకవర్గం..

● **సోంపేట:** బారువ రోడ్డు నుంచి రామయ్యపట్నం వరకు రూ.2.09 కోట్లు. పాత ఎన్‌హెచ్-5 రోడ్డు నుంచి మండల బోర్డర్ వరకు రూ. 2.36 కోట్లు.

● **కవిటి:** ఎన్‌హెచ్ 16 నుంచి శిలగాం వరకు రూ. 1.19 కోట్లు.

● **ఇచ్ఛాపురం:** ఐబీ రోడ్డు నుంచి బొడ్డకలి వరకు రూ. 1.14 కోట్లు.

నరసన్నపేట నియోజకవర్గం..

● **జలుమూరు:** ఎన్‌హెచ్-326ఏ నుంచి పెద్దదూగం వరకు రూ. 1.53 కోట్లు. గొటివాడ నుంచి సైరిగాం వరకు రూ. 1.68 కోట్లు.

● **నరసన్నపేట:** తోటాడ నుంచి సుందరాపురం వరకు రూ. 1.39 కోట్లు.

● **సారవకోట:** డీఎల్ పురం నుంచి పనసలోవ వరకు రూ. 1.91 కోట్లు.

పలాస నియోజకవర్గం..

● **మందస:** పాతఎన్‌హెచ్ 5 నుంచి గంద్రుగాం జంక్షన్ వరకు (బలియాగాం మీదుగా) సుమారు 10.5 కిలోమీటర్ల పొడవునా ఈ రోడ్డు నిర్మాణానికి (మిగతా 8వ పేజీలో..)

మళ్లీ తవ్వేస్తున్నారు

● గంగువాడలో కంకర కోసం యథేచ్ఛగా..

● పట్టించుకోని రెవెన్యూ అధికారులు



కొండను తవ్వి కంకర తరలించిన దృశ్యం

పలాస రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పలాస మండలంలో కంకర తవ్వకాలు మళ్లీ యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇటీవల కేదారిపురం, లొద్దభద్ర, రాజగోపాలపురం ప్రాంతాల్లో కొండల వద్ద కంకరను యంత్రాలతో ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ట్రాక్టర్లతో అక్రమ రవాణా సాగించారు. కేదారిపురం పంచాయతీ కంబిరిగాం వద్ద కంకర డంపింగ్ చేశారు. అలాగే రామకృష్ణాపురం ఉజ్జుడిమెట్ట వద్ద కంకర తవ్వకాలు చేపట్టారు. దీనిపై పత్రికల్లో కథనాలు రాగా.. మైనింగ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. కంబిరిగాం వద్ద డంపింగ్‌పై జరిమానా విధించారు. దీంతో అక్రమార్కులు కొన్నిరోజులపాటు తవ్వకాలు నిలిపివేశారు. కానీ మళ్లీ గత మూడు రోజుల నుంచి గంగువాడ ప్రాంతంలోని కొండల అంచుల్లో ఉన్న కంకరను గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళ తవ్వేసి.. ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకుని.. కంకర తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్డీవో వెంకటేష్ వద్ద ప్రస్తావించగా తవ్వకాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నౌపడ ఉప్పు కనుమరుగు

● ప్రాభవం కోల్పోతున్న పరిశ్రమ

● భూముల లీజును పునరుద్ధరించని కేంద్రం

● ఏడేళ్లుగా సాగుకు దూరమైన రైతులు



నౌపడలో సాగవుతున్న ఉప్పు పంట (ఫైల్)



సంతబొమ్మాళి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఉప్పు గల్లీగా ఎంతో ప్రసిద్ధి చెందిన నౌపడ ఉప్పు పరిశ్రమ ఇప్పుడు అంతరించిపోయే దశకు చేరుకుంది. ఉప్పు భూముల లీజును కేంద్రం రెన్యువల్ చేయకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. ఫలితంగా దిగుబడి లక్షల టన్నుల నుంచి వేలకు పడిపోయింది. మండలంలోని నౌపడ, పాలనాయుడుపేట, సీతానగరం, మూలపేట, మర్రిపాడు, భావనపాడు, సెలగపేట, ఆర్.సున్నాపల్లి, యామలపేట తదితర గ్రామాల్లో సుమారు ఆరు వేల ఎకరాల్లో ఉప్పు పంట గతంలో సాగయ్యేది. ఈ ప్రాంతంలోని ఉప్పు భూములు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండడంతో వాటిని సన్నకారు రైతులు లీజుకు తీసుకుని ఉప్పును సాగుచేసేవారు. ఈ లీజు 2018తో ముగిసిపోయింది. లీజును పునరుద్ధరించమని పలుమార్లు ఈ ప్రాంత రైతులు కేంద్ర ప్రభుత్వ అధికారులకు వినతులు అందించినా ఫలితం లేకుండా పోయింది. అయితే, రైతుల కోరిక మేరకు భూముల లీజుకు సంబంధించి 2020లో కేంద్రం సబ్ కమిటీ వేసింది. ఈ కమిటీ ఈ ప్రాంత ఉప్పు భూములను పరిశీలించి కేంద్రానికి నివేదిక ఇచ్చింది. అయినా నేటి వరకు లీజును అధికారులు పునరుద్ధరించలేదు. ప్రస్తుతం రెండు ప్రైవేటు కంపెనీల ఆధ్వర్యంలో కేవలం 2వేల ఎకరాల్లో మాత్రమే మండలంలో ఉప్పుపంట సాగవుతుంది. గతంలో (మిగతా 8వ పేజీలో..)



ఎచ్చెర్ల: వెంకటేశ్వర కళాశాల కేంద్రంలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

టెట్ ప్రారంభం

● తొలిరోజు 656 మంది హాజరు

ఎచ్చెర్ల/టెక్కలి/నరసన్నపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) బుధవారం ప్రారంభమయ్యింది. జిల్లాలోని నాలుగు కేంద్రాలతోపాటు ఒడిశా రాష్ట్రం బరంపురంలోని మూడు కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు రెండు షిఫ్టుల్లో జరిగిన ఈ పరీక్షకు తొలిరోజు 712 మంది అభ్యర్థులకు 656 మంది హాజరుకాగా, 56 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 402 మందికి 371 మంది, మధ్యాహ్నం 310 మందికి 285 మంది పరీక్ష రాశారు. ఎచ్చెర్ల మండలంలోని శ్రీశివానీ ఇంజరింగ్ కళాశాల (చిలకపాలెం)లో రెండు షిఫ్టుల్లో కలిపి 220కు 205 మంది, శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో రెండు షిఫ్టుల్లో కలిపి 200కు 184 మంది హాజరయ్యారు. టెక్కలి మండలంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఉదయం 100 మందికి 90 మంది, మధ్యాహ్నం 100మందికి 92 మంది పరీక్ష రాసినట్లు ఎంఈవో చిన్నారావు తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

మద్యం షాపు సీజ్

● కల్తీ మందు విక్రయించడంతో అధికారుల చర్యలు

సరుబుజ్జిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఆర్ వైన్ షాపును బుధవారం ఆమదాలవలస ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు సీజ్ చేశారు. గత నెల 28న ఎక్సైజ్ అధికారులు ఈ దుకాణాన్ని తనిఖీ చేయగా 10.88 లీటర్ల కల్తీ మద్యం పట్టుబడింది. ఆ సమయంలో షాపులో విధులు నిర్వహిస్తున్న ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ఆ మరుసటి రోజు నుంచే మళ్లీ ఆ మద్యం షాపును తెరిచి విక్రయాలు చేపట్టడంతో అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఆమదాలవలస ఎక్సైజ్ ఎస్ఐ కుమార్ తన సిబ్బందితో బుధవారం పీఆర్ వైన్ షాపు వద్దకు చేరుకొని మరోసారి షాపులో తనిఖీలు నిర్వహించారు. అనంతరం తలుపులు మూసివేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఇటీవల నమోదైన కేసు నిమిత్తం షాపును తాత్కాలికంగా సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అపరాధ రుసుం చెల్లించిన తర్వాత తిరిగి షాపును తెరుచుకోవచ్చునని అన్నారు.

నక్క స్వైర విహారం

● 12మందికి గాయాలు



గ్రామస్థుల చేతిలో హతమైన నక్క

ఇచ్ఛాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): డొంకూరు గ్రామంలో పిచ్చి నక్క మంగళవారం రాత్రి స్వైర విహారం చేసింది. దాని దాడిలో 12 మందికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డొంకూరుకు చెందిన రైతులు మంగళవారం రాత్రి పొలాల్లో వరి నూర్పులు ముగించుకొని ఇంటికి వస్తుండగా చీకట్లో ఒక పిచ్చి నక్క దాడికి పాల్పడింది. అది కుక్కో.. నక్కో తెలియక గాయాలతో అంతా పరుగులు తీశారు. గ్రామానికి చెందిన యువకులు లైట్లతో వచ్చి చూడగా అది పిచ్చి నక్కగా గుర్తించి కర్రలతో కొట్టి హతమార్చారు. నక్క దాడిలో గ్రామానికి చెందిన దున్న ఝాన్సీ, దున్న మహాలక్ష్మి, శివంగి గణపతి, శింగారి ఈశ్వరి, పుక్కళ్ల రామారావు, ఎరిపల్లి జోగారావు, మాగుపల్లి కొండయ్య, జి.చిన్నారావు, దున్న హేమసుందర్, దున్న శంకర్‌తో పాటు ఎనిమిదేళ్ల పిల్లలు గవల శేషగిరి, నిర్మలకు గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొంతమంది మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అటవీశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవటంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి వచ్చేస్తున్నాయని డొంకూరు గ్రామపెద్ద దున్న లోకనాథం అన్నారు.

సాగునీరు అందట్లే!

● ఆక్రమణలు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా కాలువలు

● బీడుగా మారుతున్న శివారు భూములు

● ఆయకట్టు రైతుల ఆందోళన

● రబీకైనా బాగు చేయాలని విన్నపం



ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండిన సంకుజోడి కాలువ

హరిపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలోని పలు సాగునీటి కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. దీనికి తోడు కాలువలు ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయి అధ్వానంగా మారుతున్నాయి. దీంతో శివారు భూములకు సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందస మండలంలో డబార్సింగి, కళింగదళ్, దామోదరసాగర్ రిజర్వాయర్లతోపాటు సంకుజోడి, నక్కాసాయి, గోపాలసాగరం వంటి పెద్ద చెరువులు, సునాముది, మహేంద్రతనయ కాలువలు ఉన్నాయి. పలాసలో వరహాల గెడ్డ, లొత్తూరు రిజర్వాయర్, వజ్రపుకొత్తూరులో బెండిగెడ్డ, వంశధార కాలువలు ఉన్నాయి. అయితే, గత రెండేళ్లుగా ఈ కాలువల ద్వారా పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. ప్రాజెక్టులు నిండినా సంగం ఆయకట్టుకు కూడా నీరు చేరడం లేదు. రూ.వేలకు వేలు భూమి శిస్తులు చెల్లిస్తున్నా పిడికిలి పంట కూడా చేతికందడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా కాలువలు ఆక్రమణదారుల చెరలో చిక్కి శల్యమవుతున్నాయి. కొందరు రైతులు (మిగతా 8వ పేజీలో..)

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

● అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● 210 గ్రాముల బంగారం, 709 గ్రాముల వెండి స్వాధీనం

● రూ.83,700 నగదు కూడా..

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ వివేకానంద



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, వెనుక నిందితులు (ముసుగులో ఉన్నవారు)



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు, నగదు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను బూర్జ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి బంగారం, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్.వివేకానంద బుధవారం వెల్లడించారు. ఈ నెల 1న బూర్జ మెయిన్ రోడ్డులో నివాసముంటున్న చెన్నూరు రమేష్ వేరే ఊరు వెళ్లి తిరిగి తన ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు విరగ్గొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ప్రవల్లిక సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఫింగర్ ప్రింట్ (మిగతా 8వ పేజీలో..)



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

● ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

● హరిత మహోత్సవంలో చిన్నారులతో కలెక్టర్

8లో

బడి భోజనానికి సెలవు లేదు

8లో

పల్స్ పోలియోకు సన్నద్ధం కావాలి

9లో

బడి భోజనానికి సెలవు లేదు


కోటబొమ్మాళి జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

● పదో తరగతి విద్యార్థులకు ప్రయోజనం

కోటబొమ్మాళి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పదోతర గతిలో నూరుశాతం ఫలితా ల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక తరగతులను నిర్వ హిస్తోంది. ఇందుకోసం వంద రోజుల ప్రణాళికను ప్రకటించి అమలు చేస్తోంది. పరీక్షల వరకు ఇవి కొనసా గుతాయి. ఉపాధ్యాయులు సెలవు దినాల్లోనూ తరగతు లు నిర్వహిస్తారు. అ సమ యంలో విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవా ల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. బడిలోనే వడ్డించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

21 వేలు మందికి ప్రయోజనం..

పదో తరగతి విద్యార్థులు విద్యార్థులకు మార్చి 16వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. వీరికి ప్రస్తుతం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు పాఠశాలల్లో తరగతులు జరుగుతున్నాయి. సెలవు రోజుల్లో షెడ్యూలు మారుతుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు ఉంటాయి. ఆ రోజుల్లో పిల్లల ఆకలి బాధకు గురికాకుండా ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రెండో శనివారం, ఆదివారం, ఇతర సెలవు దినాల్లో మెనూ ప్రకారం భోజనాన్ని అందించేలా పాఠశాలల మధ్యాహ్న భోజనపథకం సంచాలకులు బి. శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో ఉన్న 450 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 21,348 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

మంచి అవకాశం..

పదో తరగతి ప్రత్యేక తరగతులకు హాజరయ్యే పిల్లలకు సెలవు దినాల్లోనూ మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ప్రభుత్వం ఆదేశిం చింది. తల్లిదండ్రులు సహకరించి పిల్లల్ని పంపించాలి. సాధారణ రోజుల కంటే సెలవు దినాల్లో ఉపాధ్యాయులు ఎక్కువ సమయం కేటాయిస్తారు. సబ్జెక్టుల్లో పిల్లల్ని మరింతగా తీర్చిదిద్దేందుకు అవకాశముంటుంది.

-ఎ.రవిబాబు, డీఈవో, శ్రీకాకుళం

సాగునీరు అందట్లే!

(ఏడో పేజీ తరువాయి)

కాలువల గట్లను ఆక్రమించి పొలాల్లో కలిపేస్తున్నారు. ఫలితంగా శివారు భూములకు నీరందడం లేదు. పలు రిజర్వాయర్‌ల ఆయకట్టులో నిర్మించిన సిమెంటు కట్టడాలు సైతం కూలిపోయి నీరు ముందుకు పారడం లేదు. కనీసం రబీకైనా ఆక్రమణలు తొలగించి, కాలువలను బాగు చేసి సక్రమంగా సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.


మహేంద్రతనయ కాలువలో విరిగిన సిమెంట్ కట్టడం

భూముల బీడు వారుతున్నాయి..

సంకుజోడి రిజర్వాయర్ నిర్మాణం కలగా మారింది. వందల ఎకరాల సంకుజోడి చెరువు, కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. పూడిక పేరుకుపోయి నీటి నిలువ సామర్థ్యం లేక సగం భూములకు కూడా నీరందం లేదు. కొందరు కాలువలు, గెడ్డలను ఆక్రమించి పొలాల్లో కలిపేస్తున్నారు. మరికొందరు జీడితోటలు సాగుచేస్తున్నారు. దీంతో వందలాది ఆయకట్టు భూములకు నీరందక బీడు వారుతున్నాయి. ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించి కాలువలను బాగు చేయాలి.

-గెడ్డవలస భీమారావు, కుంటికోట, ఆయకట్టు రైతు

నివేదికలు తయారు చేశాం..

రిజర్వాయర్‌లకు పూర్వవైభవం కల్పించడం ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. కాలువల పునర్నిర్మాణం, మరమ్మతుల కోసం ఇప్పటికే నివేదికలు తయారు చేశాం. గతంలో నీరుచెట్టు పథకం కింద ప్రధాన నిర్మాణాలు చేపట్టాం. ప్రభుత్వ పథకాలు, ఉపాధి హామీని జతచేసి పూర్తిస్థాయిలో పనులు చేపట్టి, ఆక్రమణలు తొలగించి రైతుల కష్టాలు తీరుస్తాం.

-పి.శ్రీనివాసరావు, ఏఈఈ, జలవనరుల శాఖ, మందస


పరీక్ష కేంద్రంలో అభ్యర్థులను క్యూలో చెక్ చేస్తున్న సెక్యూరిటీ


ఆరుబయట క్యారేజీ భోజనం చేస్తున్న అభ్యర్థులు


శివానీ ఇంజనీరింగ్ కళాశాలకు ఎగ్జామ్‌కు వస్తున్న దివ్యాంగులు


చంటిబిడ్డతో టెట్ ఎగ్జామ్‌కు..

టెట్ సందడి

ఉపాధ్యాయులు టెట్ రాయాలని ప్రభుత్వ ఆదేశాలతో బుధవారం జిల్లాలో పలు కేంద్రాల్లో ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో టెట్ సందడి నెలకొంది. దివ్యాంగులు, మహిళలు పెద్ద ఎత్తున ఈ పరీక్షలకు హాజరయ్యారు. కళాశాలల సిబ్బంది పరీక్షార్థులను నిశితంగా పరీక్షించి హాలులోకి అనుమతించారు.

-ఆంధ్రజ్యోతి బృందం

నౌపడ ఉప్పు కనుమరుగు

(ఏడో పేజీ తరువాయి)

ఉప్పు పంట పండిస్తూ జీవనం సాగించిన కుటుంబాలు కొంత మంది ఈ ప్రైవేటు కంపెనీల్లో కూలీలుగా చేరగా, మరికొంత మంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసబాట పట్టారు.

గతమెంతో ఘనం..

నౌపడ ఉప్పు పరిశ్రమ.. ఒకప్పుడు ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో, దేశంలో రెండో స్థానంలో ఉండేది. రైతులు ప్రతి ఏటా డిసెంబరులో ఉప్పు సాగును ప్రారంభించి జూలై మొదటి వారం వరకూ కొనసాగించేవారు. ప్రతి నలభై రోజులకు ఒకసారి దిగుబడి వచ్చేది. ఈ సమయంలో ఈ ప్రాంతంలో ఎంతో సందడిగా ఉండేది. ఇక్కడి నుంచి రైల్వే వ్యాగన్ల ద్వారా ఒడిశా, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు ఉప్పు రవాణా జరిగేది. రైల్వే ద్వారా రవాణా జరగడం.. ఖర్చులు కూడా తక్కువగా ఉండడంతో అప్పట్లో రైతులకు ఉప్పు సాగు లాభదాయంగా ఉండేది. అయితే, ఈ ప్రాంతంలో రైల్వే లైన్‌ను తొలగించడంతో నౌపడ ఉప్పు రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. రోడ్డు మార్గం ద్వారా ఉప్పును రవాణా చేయడంతో ఖర్చులు పెరిగాయి. అయినా రైతులు సాగుకు ముందుకు వస్తున్నా భూముల లీజును కేంద్రం రెన్యువల్ చేయకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. దీనివల్ల ఉప్పు పరిశ్రమ ఉనికి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

లీజును పునరుద్ధరించాలి..



ఉప్పు భూముల లీజును కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలి. అప్పుడే ఈ ప్రాంతంలో ఉప్పు పరిశ్రమకు పూర్వ వైభవం వస్తుంది. 2018లో లీజు పూర్తయింది. రెన్యువల్ కోసం రైతులు చేసిన విజ్ఞప్తుల మేరకు 2020లో కేంద్రం సబ్ కమిటీ వేసినా ఇంత వరకు ఎటువంటి చర్యలు లేవు. నౌపడ ఉప్పు పరిశ్రమ పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

-పిలక రవికుమార్‌రెడ్డి, కార్యదర్శి, సన్నకార ఉప్పు ఉత్పత్తికారుల సంఘం, నౌపడ

ఫిబ్రవరి నుంచి కేంద్రీయ విద్యాలయం తరగతులు

● పలాసలో పర్యటించిన కేంద్ర బృందం ● తాత్కాలిక నిర్వహణకు రైల్వే ఆర్పీఎఫ్ బ్యారక్స్ పరిశీలన ● రెండేళ్లలో భవనాల నిర్మాణం పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే శిరీష

పలాస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు మొదలయ్యాయి. బుధవారం కేంద్రప్రభుత్వం పంపించిన ప్రత్యేక బృందం పలాసలో పర్యటించింది. రైల్వే ఆర్పీఎఫ్ బ్యారక్స్‌లో తాత్కాలిక తరగతులు నిర్వహించడానికి ఆ ప్రాంతాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. 2026 ఫిబ్రవరి నుంచి ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ విద్యాబోధన చేయడానికి అంతా సిద్ధం చేస్తున్నట్లు బృందం సూచనప్రాయంగా తెలిపింది. రెండేళ్లలో కేంద్రీయ విద్యాలయం భవనాలు నిర్మించి అక్కడ నుంచే పూర్తిస్థాయి తరగతులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రకటించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రకటన చేశారు. పలాసకు కేంద్రీయ విద్యాలయం ఏంటని, ఇది ఒట్టిమాటే అని వైసీపీ నాయకులు అప్పట్లో ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి మూడు కేంద్రీయ విద్యాలయాలు మంజూరుకాగా అందులో పలాస-కాశీబుగ్గలో ఒకటి ఏర్పాటు చేస్తున్నారు. దీతో అధికారులు సూదికొండకు దిగువన 11 ఎకరాల స్థలాన్ని సేకరించి కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి అందించారు. రూ. 150 కోట్ల నిధులతో విద్యాలయం నిర్మాణం త్వరలో ప్రారంభం కానుంది. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచే విద్యాలయంలో తరగతులు బోధించడానికి కేంద్రం అనుమతులు ఇవ్వడంతో ఇప్పటికే ఉన్నతాధికారుల బృందం రెండుమార్లు పలాసలో పర్యటించింది. తాజాగా బుధవారం విశాఖపట్నం కేవీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నలుగురుతో కూడిన బృందం పర్యటించింది. తొలుత పలాస రైల్వేకాలనీలో ఉన్న ఆర్పీఎఫ్ బ్యారక్స్‌ను పరిశీలించింది. ఇక్కడ 10 తరగతి గదులు ఉండగా అదనంగా మరో ఆరు గదులు అవసరం ఉన్నట్లు బృందం సభ్యులు గుర్తించారు. మిగిలనవన్నీ తరగతులు నిర్వహించడానికి వినియోగంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. దీనిపై నివేదికను కేంద్రానికి పంపిస్తామని తెలిపారు. ఆర్పీఎఫ్ బ్యారక్స్‌ను తరలించడానికి ఇంకా రైల్వేశాఖ అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఈ బ్యారక్స్‌లో విశాఖపట్నం, ఖుర్దారోడ్ డివిజన్‌కు చెందిన మొత్తం 40 మందికి పైగా ఆర్పీఎఫ్ సిబ్బంది ఉంటారు. వారికి కొత్తగా వసతి ఏర్పాటు చేసేవరకు బ్యారక్స్‌ను ఖాళీ చేయడానికి ఆస్కారం లేదని రైల్వేఅధికారులు కేంద్రబృందం, ఆర్డీవో జి.వెంకటేష్‌కు తెలిపారు. దీనిపై తాము జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించిన తరువాతే బ్యారక్స్‌ను స్వాధీనం చేసుకుంటామని కేంద్రబృందం స్పష్టం చేసింది.

రెండేళ్లలో కేంద్రీయ విద్యాలయం పూర్తి చేస్తాం..

రెండేళ్లలో కేంద్రీయ విద్యాలయం కొత్త భవనాల నిర్మాణం పూర్తి చేస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. కేంద్ర బృందసభ్యులతో ఆమె మాట్లాడారు. తరగతులు ప్రారంభించడానికి అన్నివిధాలా సహాయం అందిస్తామని వారికి స్పష్టం చేశారు. 2026 ఫిబ్రవరి నెలలో తాత్కాలిక వసతిగదుల్లో కేంద్రీయ విద్యాలయం ప్రారంభిస్తామన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ బోధనలు ఉంటాయన్నారు. మూడో తరగతి నుంచే కంప్యూటర్ విద్యను అందించడానికి చర్యలు తీసుకుంటారని, ఇందుకు అవసరమైన ల్యాబ్‌లు, తరగతి గదులు సిద్ధం చేయాల్సి ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కేంద్రబృందం వెంట తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, సవర రాంబాబు ఉన్నారు.


పలాస రైల్వే ఆర్పీఎఫ్ బ్యారక్స్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు, ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆర్డీవో వెంకటేష్

గ్రామీణ రోడ్లకు రూ.100 కోట్లు

(ఏడో పేజీ తరువాయి)

అత్యధికంగా రూ. 5.72 కోట్లు కేటాయించారు. అలాగే మందస-హరిపురం రోడ్డు నుంచి దిమిరియా వరకు రూ. 3 కోట్లు కేటాయించారు.

● **వజ్రపుకొత్తూరు:** చినరాజం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బట్టుపురం వరకు రూ. 2.23 కోట్లు.

పాతపట్నం నియోజకవర్గం..

● **పాతపట్నం:** గంగువాడ నుంచి చినమల్లిపురం వరకు రూ. 3.12 కోట్లు. పీటీ రోడ్డు నుంచి బడ్డుమర్రి వరకు రూ. 2 కోట్లు.

● **ఎల్.ఎన్.పేట:** ఫాక్సుదొరపేట నుంచి గార్లపాడు వరకు రూ. 2.37 కోట్లు.

● **హిరమండలం:** కేఆర్ రోడ్డు నుంచి కొమనాపల్లి వరకు రూ. 1.73 కోట్లు.

శ్రీకాకుళం నియోజకవర్గం..

● **శ్రీకాకుళం:** పాత్రునివలస ఎస్సీ కాలనీ నుంచి నారాయణపురం వరకు రూ. 1.34 కోట్లు. లంకాం నుంచి మాలమన్నయ్యపేట వరకు రూ. 1.28 కోట్లు.

గార: సీఎస్‌పీ రోడ్డు నుంచి రాఘవపురం వరకు రూ.1.76 కోట్లు.

టెక్కలి నియోజకవర్గం..

కోటబొమ్మాళి: ఎన్‌హెచ్-16 నుంచి కొత్తపల్లి వరకు (చినసాన మీదుగా) రూ. 3.75 కోట్లు. జేజే రోడ్డు నుంచి పట్టుపురం వరకు రూ. 3.36 కోట్లు.

నందిగాం: నౌగాం రోడ్డు నుంచి కందులగూడెం వరకు రూ. 3.34 కోట్లు.

● **సంతబొమ్మాళి:** బోరుభద్ర నుంచి డి.మరువాడ వరకు రూ.1.33 కోట్లు.

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

(ఏడో పేజీ తరువాయి)

ఆధారాలను సరిచూడగా పాత నేరస్తులను పోలిఉన్నాయి. ఈ మేరకు అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరానికి చెందిన ఉండవ నాగరాజు, విశాఖపట్నం గంట్యాడకు చెందిన చేపల ఆనంద్, అనకాపల్లి జిల్లా మాటూరు గ్రామానికి చెందిన మాటూరు శ్రీను, కోనసీమ జిల్లా చింతలపూడి గ్రామానికి చెందిన మద్దెల చంటిబాబు, బిహార్ రాష్ట్రం బెగునార్ జిల్లా అడ్డాపూర్‌కు చెందిన శుభంమిత్రాను అరెస్టు చేశారు. నిందితుల్లో ఒకరైన మాటూరు శ్రీను అత్తవారి గ్రామం బూర్జ. ఆయన బూర్జలో ఉన్నపుడు చెన్నూరు రమేష్ ఇంటికి తాళం వేసి ఉండ డాన్ని గమనించాడు. దీనిపై మిగిలిన వారికి సమాచారం అందించగా వారు వచ్చి దొంగతనానికి పాల్పడినట్టు తమ విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. వీరి నుంచి రూ.29 లక్షల విలువైన 210 గ్రాముల బంగారం, 709 గ్రాముల వెండి, రూ.83,700 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరంతా వివిధ నేరాల్లో జైల్లో శిక్షలు అనుభవిస్తున్న సమయంలో పరిచయం ఏర్పడి ఒక ముఠాగా తయారై విశాఖపట్నం గాజువాకలో నివసిస్తున్నారని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై దొంగతనానికి అలవాటు పడ్డారని డీఎస్పీ తెలిపారు. ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, బూర్జ ఎస్ఐ ప్రవల్లిక ఉన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

● ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

● హరిత మహోత్సవంలో చిన్నారులతో కలెక్టర్


విచిత్ర వేషధారణ చిన్నారులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్









మహిళా రైతు వేషంలో.. సేవ్ ప్లానెట్ నినాదంతో.. వృక్షో రక్షతి రక్షితః తదితర నినాదాలతో చిన్నారుల వేషధారణలు


వివిధ వేషధారణలతో చిన్నారుల సందడి

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని 80 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం చిన్నారులు సందడి చేశారు. హరిత మహోత్సవంలో భాగంగా ప్రకృతిని పరిరక్షించాలనే సందేశంతో వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొని ఆహూతులను అలరించారు. ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన వివిధ అంశాలపై చిన్నారులు వేషధారణలు ఆకట్టుకున్నాయి. సందేశాత్మకంగా వేషధారణ చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హాజరై చిన్నారులతో సరదాగా గడిపారు.


పంటలను తీసుకువస్తూ..

ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి

● జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



శ్రీకూర్మం రైతు సేవా కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

గార, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలని, సాంకేతిక సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం శ్రీకూర్మంలో ఎరువుల పంపిణీపై రైతులతో మాట్లాడారు. తర్వాత శ్రీకూర్మంలో రెండు రైతు సేవా కేంద్రాలు, శ్రీకూర్మరం జంక్షన్, గారలో ఉన్న రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కస్టోడియన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహ సీల్దార్ ఎం.చక్రవర్తి, వ్యవసాయాధి కారి దుంపల పద్మావతి, ఏఈవో బడగల దుర్గా ప్రసాద్, ఆర్ఐ రాజేందర్ పాల్గొన్నారు.

మానవ హక్కులతోనే సమాన జీవనం

● జిల్లాన్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు



ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి తదితరులు

శ్రీకాకుళం లీగల్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అందరూ సమానంగా జీవించేందుకు మానవహక్కులే కీలకం అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. బుధవారం స్థానిక మెప్మా కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తికీ లభించాల్సిన హక్కుల ను వివరిస్తూ సమాజంపై వారి బాధ్యతలు మరువరాదన్నారు. అనంతరం మానవ హక్కులు కాపాడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎస్.వెంకటరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు వావిలపల్లి జగన్నాథం నాయుడు, చింతాడ కృష్ణమోహన్, మణిశర్మ, గేదెల ఇందిరాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం: అశోక్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి/కంచిలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. రామయ్య పుట్టుగలో బుధవారం పలువురు లబ్ధిదారులకు సీఎం ఆర్‌ఎఫ్ చెక్కుల ను అందించారు. కుటుంబాల ఆర్థిక స్థితిగతులను పరిశీలన చేసి కొంత సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండ లాలకు చెందిన పలువురికి రూ.14 లక్షలు చెక్కులను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేత మాదిన రామారావు, కిషోర్ కుమార్‌పాడి, శ్రీరాములు, శ్రీకాంత్, పాల్గొన్నారు.

మహిళాశక్తిని గుర్తించింది సీఎం చంద్రబాబు: శంకర్



రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళల శక్తిని గుర్తించి ప్రోత్సహిస్తున్నది సీఎం చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక రైతుబజార్ వద్ద మహిళా మార్ట్ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీజీలక్ష్మి మోడల్ కియోస్క్ మీ సేవలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు కార్యదీక్షపరులను, వారు ఏ పని చేపట్టినా విజయవంతమవుతుందన్నారు. డీజీలక్ష్మిలకు అప్పగించిన మీసేవల కార్యక్రమాన్ని ప్రజ ల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎస్.వెంకటరావు, శ్రీనిధి పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బి.నాగలక్ష్మి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ సభ్యులు

గుజరాతీపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ కమిషనర్ అనాలోచిత చర్యల కారణంగా ఆ శాఖ అధోగతి పాలవుతోందని యూటీఎఫ్ నేతలు అన్నారు. స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ.. టెట్ నుంచి సీనియర్ ఉపాధ్యాయులను మినహాయించాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కోరారు. జిల్లా సహాధ్యక్షురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ 2010 ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ రవీంద్ర, పి.అప్పారావు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు సన్నద్ధం కావాలి

● 1.55 లక్షల మంది చిన్నారుల లక్ష్యం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. జిల్లాలో 5 ఏళ్ల లోపు ఉన్న 1,55,876 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలో దాదాపు 6,18,024 ఇళ్లను సందర్శించి పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. మొదటి రోజున పోలియో బూత్‌లలో, రెండు రోజులు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. జిల్లావ్యాప్తంగా 1,252 పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామని, వీటిలో గ్రామాల్లో 683, గిరిజన ప్రాంతాల్లో 377, పట్టణాల్లో 192 ఉన్నాయన్నారు. బస్, రైల్వే స్టేషన్లు, దేవాలయాలు, సంత లు, ప్రయాణంలో ఉన్న పిల్లల కోసం 40 ట్రాన్సిట్ బూత్‌లు పనిచేస్తాయన్నారు. వీటికి అదనంగా వీధులు, పొలాల్లోని పిల్లల కోసం 84 మొబైల్ బృందాలను నియమించామన్నారు.

వలసలు అధికంగా ఉండే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు వంటి 101 హైరిస్క్ ప్రాంతాల్లోని 6732 మంది పిల్లలకు తప్పని సరిగా చుక్కలు వేయనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి 7430 మంది సిబ్బందిని నియమించామని, 122 మంది సూపర్‌వైజర్లు, 71 పీహెచ్‌సీలు, 15 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఇతర కేంద్రాలకు వ్యాక్సిన్ సరఫరా కోసం 206 వాహనాలను సిద్ధం చేశామన్నారు. రెండు రోజుల ముందు నుంచే డప్పు చాటింపు, గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలని డీఎంహెచ్‌వో డా.అనితను ఆదేశించారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి

రణస్థలం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి సహకరించాలని దేవదాయ శాఖ కమిషనర్‌ను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. రణస్థలం మండలం కొండములగాం కొండపై నిర్మించ తలపెట్టిన వేంకటేశ్వర స్వామి ఆలయం, ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంలో పెండింగ్‌లో ఉన్న రామాలయం నిర్మాణాలపై చర్చించారు. పలు ఆలయాలకు సంబంధించి ధూప, దీప నైవేద్యాలకు సహకరించాలని కోరారు.

ఆడిటర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా 'బుడుమూరు'

ఆమదాలవలస, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆడిటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆమదాలవలస పట్టణానికి చెందిన సీనియర్ ఆడిటర్ బుడుమూరు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీశైలం మల్లన్న సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం పట్టణానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర సంఘం ప్రతినిధులు తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను పట్టణానికి చెందిన పలువురు ఆడిటర్లు అభినందించారు.

మహాసభలను జయప్రదం చేయండి

పొందూరు/కంచిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నలో ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు నిర్వ హించనున్న సీఐటీయూ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మ న్నాయుడు, ప్రధాన కార్యదర్శి పి. తేజేశ్వరరావు కోరారు. ఈ మేరకు పొందూరు, కంచిలిలో బుధవారం మహా సభల పోస్టర్లను ఆవిష్కరించారు. జనవరి 4న ఆర్కే బీచ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. కార్మిక హక్కులను హరించి కార్పొరేట్లకు మేలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, పిట్ట కృష్ణారావు, పాపారావు, డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

గిట్టుబాటు ధర పొందాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పీఏసీఎస్ ఆధ్వర్యంలో తేలుకుంచి రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ అధ్యక్షుడు పెదిని బాబ్జీ బుధవారం ప్రారంభించారు. ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని గిట్టుబాటు ధర పొందాలని కోరారు. కార్య క్రమంలో ఏవో అజయ్‌కుమార్, సీఈవో భుజంగరావు, టీడీపీ మండల అధ్యక్షుడు లోపింటి పద్మ నాభం, పీఏసీఎస్ సభ్యుడు గిన్ని బాలరాజు, మేరుగు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు స్థల పరిశీలన

సరుబుజ్జిలి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రొట్టవలసలో ఏర్పాటు చేయనున్న ఎత్తిపోతల పథకా నికి సంబంధించి స్థలాన్ని బుధవారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ముంగెన్న చెరువు మధ్య భాగం గుండా వంశధార కుడి ప్రధాన కాలువ ప్రవహిస్తున్నప్పటికీ ఎగువ ప్రాంత రైతులకు చెందిన సుమారు వంద ఎకరాలకు సాగునీరందడం లేదు. ఈ విషయాన్ని టీడీపీ నేతలు తాడేల వెంకటరమణ, తాడేల రాజారావు ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జేఈ అనిల్‌కుమార్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో వంశధార కుడి కాలువ నుంచి రొట్టవలస, తిమిరి బందకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించడానికి సుమారు రెండు కిలోమీటర్ల స్థలాన్ని పరిశీలించామన్నారు. అనుమతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు మల్లేశ్వరరావు, గోవిందరావు, రమణ, రాజారావు, సత్యనారాయణ, నాయుడు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుంటే పోరాటం

● సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ



కలెక్టరేట్ వద్ద నిరసన చేపడుతున్న సీపీఐ నాయకులు

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుంటే పోరాటం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద రైతు సమస్యలపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని, 6.70 కోట్ల గోనుసంచులు అందుబాటులో ఉంచుతామని ప్రభుత్వం చెప్పినా ఆ దిశలో చర్యలు లేవన్నారు. తేమశాతం అధికంగా ఉందని, ధాన్యం రంగు మారాయనిన్న కారణాలతో ధాన్యం కొనుగోలులో కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మొక్కజొన్న అమ్మకాల్లో కూడా రైతులు క్వింటాలుకు రూ.800 వరకు నష్టపోతున్నారన్నారు. ధాన్యం, మొక్కజొన్న, పత్తి పంటలకు ప్రభుత్వం బోనస్ కలిపి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్య దర్శి లండ వెంకటరావు, కొన్న శ్రీనివాస్, సంతోష్, హరికృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రను విజయవంతం చేయాలి

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 15 నుంచి 29 వరకు నిర్వహించే 'అభ్యుదయం' సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం జిల్లా వైద్యఆరోగ్య, రెవెన్యూ, విద్యా శాఖ అధికారులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైకిల్ యాత్రలో రెవెన్యూ, విద్యా, మెడికల్ అండ్ హెల్త్, ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో నిర్వహించాలన్నారు. సోషల్ మీడియా ఇన్ఫ్లు యెన్సర్ల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా.అనిత, ఆర్డీవో సాయిప్రత్యూష, డీఎస్పీ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఫలితాల సాధనే లక్ష్యం

● గురుకులాల సమన్వయకర్త యశోదలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా గురుకుల విద్యాలయాల సమన్వయకర్త వై.యశోదలక్ష్మి

ఎచ్చెర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు/కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో శతశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా గురుకుల విద్యాలయాల సంస్థ సమన్వయకర్త వై.యశోదలక్ష్మి అన్నారు. ఎచ్చెర్ల బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం జిల్లాలోని గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సబ్జెక్ట్ టీచర్లకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన స్థాయి ఆధారంగా బోధించాలన్నారు. నిష్ణాతులైన వారిచే స్టడీ మెటీరియల్‌ను రూపొందించామన్నారు. విద్యార్థుల్లో నైపుణ్య స్థాయిని పెంచి ఉత్తమ ఫలితాలు సాధించే దిశలో చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల, దుప్పలవలస గురుకులాల ప్రిన్సిపాళ్లు ఎస్.పద్మజ, బి.బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రిగ్స్ పోటీల్లో విజేతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం హేమకుమారి

ఇచ్ఛాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సురంగి రాజా మైదానంలో జరిగిన నియోజకవర్గ స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో డొంకూరు పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటి చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను హెచ్‌ఎం హేమకుమారి అభినందించారు. ఖోఖో, కబడ్డీ, రన్నింగ్, షాట్‌పుట్, డిస్క్‌త్రో, లాంగ్ జంప్, హైజంప్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకొని చాంపియన్ షిప్ సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లోనూ మరిన్ని విజయాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జానకిరావు, ఉపాధ్యాయులు వెంకటరమణ పాల్గొన్నారు.

కబడ్డీ విజేత తోలాపి జట్టు

పొందూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీల్లో కబడ్డీ విభాగంలో తోలాపి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. అక్కులపేట జట్టు తో జరిగిన ఫైనల్ పోటీలో 25-16 స్కోరుతో విజయం సాధించినట్లు వ్యాయామోపాధ్యాయుడు పైడి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎం ఉమా మహేశ్వరి, ఉపాధ్యాయులు, అభినందించారు.



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పోలినాయుడు

గుజరాతీపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ వై.పోలినాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం మహిళా సాధికారత, ఐద్వా, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ స్థాయిలో అనేక దురలవాట్లకు లోనవడం, అసాంఘిక శక్తుల చేతుల్లో బందీలుగా మారడం వంటివి జరుగుతుంటాయని, వీటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్.అరుణకుమారి, ఐద్వా కన్వీనర్ ఎ.లక్ష్మి, ఆర్.హరిత, జి.రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసపాత్రో, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్తీ ఎరువులు విక్రయిస్తే కేసులు



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని పలాస, సోంపేట ఏడీఏలు రామారావు, భవానీ శంకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల రికార్డులు, ఎరువుల నాణ్యతను పరిశీలించారు. నాణ్యత లోపించినా కల్తీ ఎరువులు విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు పెదిని బాబ్జీ, సీఈవో భుజంగరావు తదితరులు పాల్గొన్నారు

న్యూస్ బాక్స్

సత్యసాయి అన్నప్రసాదం పంపిణీ

ఎచ్చెర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక పరీక్షలకు హాజరైన గర్భిణులకు సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు బుధవారం అన్నప్రసాదం అందజేశారు పీహెచ్‌సీ వైద్యులు గంగా ప్రియదర్శిని, ఎం.ఉషశ్రీ గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జెమ్స్ ఆసుపత్రి సిబ్బంది గర్భిణులకు ఉచితంగా స్కానింగ్, బీపీ, డయాబెటిక్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు, సీహెచ్‌వో బి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

బూర్జ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో అనర్థాలు కలుగతాయని, వీటికి దూరంగా ఉండాలని హెచ్‌ఎం వై.మాలతి, సీడీ పీవో గీత అన్నారు. 'బాల్య వివాహ ముక్త్ భారత్' వందరోజుల కార్యక్రమం కేకే రాజపురం హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. మానవహారం, ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.మాలతి, విద్యార్థులు, సిడిపివో గీత, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టరీత్యా నేరం

గార, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటి నియంత్రణ ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా బాలల రక్ష ణ విభాగం సోషల్ వర్కర్ డి.మధురమీనాక్షి అన్నారు. 'బాల్య వివాహ ముక్తభారత్'లో భాగంగా బుధవారం శాలిహుండం కస్తూర్బా పాఠశాలలో అవగాహన సదస్సు, విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు క్రమశిక్షణతో చదువుకో వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజని, జీసీడీవో మాధవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.ప్రసన్న కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సోంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బారువ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహ నం నడిపిన ముగ్గురికి రూ.10 వేలు చొప్పున సోంపేట న్యాయాధికారి కె.శ్రీనివాసరావు జరిమానా విధించినట్లు బారువ ఎస్‌ఐ హరిబాబు నాయుడు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆఫ్‌షోర్ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

● ఎమ్మెల్యే గౌతు శిరీష


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ ప్రాజెక్టు నిర్వాసితులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రామకృష్ణాపురం రెవెన్యూ పరిధి కోసంగిపురం వద్ద ఆఫ్‌షోర్ నిర్వాసితుల కోసం నిర్మించిన కాలనీలో బుధవారం రూ.7.66 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. 2014-19 సంవత్సరంలో టీడీపీ పాలనలో ప్రతిష్ఠాత్మకంగా ఆఫ్‌షోర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేసేందుకు వారికి ఆర్‌ఆర్ కాలనీలు ఏర్పాటు చేసి నివాసిత స్థలాలు అందజేశామన్నారు. తన తండ్రి గౌతు శివాజీ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి తన హయాంలో అకుంఠిత దీక్ష చేపట్టి ప్రత్యేక దృష్టిసారించి నిర్వాసితులకు న్యాయం చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాలనీలో ఒక్క కంకర రాయి కూడా వేయకుండా నిర్వాసితులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, పలాస మండల టీడీపీ అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు, కార్యదర్శి దువ్వాడ సంతోష్, నాయకులు గురిటి సూర్యనారాయణ, ఎస్.రాంబాబు, పంచాయతీ అధికారి నర్సింహమూర్తి, నిర్వాసిత కాలనీ వాసులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధే ధ్యేయం

హరిపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన గిరిజన ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు ఎమ్మెల్యే గౌతు శిరీషా అన్నారు. రూ.కోటి 20లక్షలు ఐటీడీఏ నిధులతో మందస మండలం చీపి- బొందుకారి రోడ్డులో వంతెన, చీపి-బుడంబో రోడ్డులో వంతెన, బీటీ రోడ్డుకు నిర్మాణాలకు ఆమె బుధవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. టీడీపీ నాయకులు బావన దుర్యోదన, సాలిన మాధవరావు, రుద్రయ్య, తమిరి భాస్కరరావు తదితరులు అధికారులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

కొత్తూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రిగ్స్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో క్రమశిక్షణ, ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. అనంతరం పీఎంశ్రీ నిధులు రూ.6.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్, కిచెన్ గార్డెన్లను ప్రారంభించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్షలో భాగంగా మండల విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు సిబ్బంది ఎమ్మెల్యేను కోరి వినతి పత్రం అందించారు. మామిడి గోవిందరావుకు వినతి పత్రం ఇచ్చారు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడ్ని చుట్టుముట్టిన గ్రామస్థులు

● విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపణ

రణస్థలం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారంటూ తల్లిదండ్రులతో పాటు బంధువులు ఓ ఉపాధ్యాయుడ్ని చుట్టుముట్టారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. రణస్థలం మండలంలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని మూడు రోజులుగా బడికి వెళ్లడం లేదు. ఏం జరిగిందని తల్లిదండ్రులు ఆరా తీయగా ఓ ఉపాధ్యాయుడు తనపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులతో పాటు గ్రామస్థులు బుధవారం మధ్యాహ్నం పాఠశాలకు చేరుకుని ఇంగ్లీష్ ఉపాధ్యాయుడ్ని ప్రశ్నించారు. నిర్బంధించినంత పనిచేశారు. దీంతో హెచ్‌ఎం వెంటనే జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవికి సమాచారం ఇవ్వగా ఆయన తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంగ్లీష్ ఉపాధ్యాయుడికి రక్షణ కల్పించారు. అక్కడినుంచి పోలీస్ జీపులో తరలించారు. దీనిపై డిప్యూటీ డీఈవో విజయకుమారి విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడి ప్రవర్తనపై ఆరాతీశారు. విద్యార్థులతో మాట్లాడి లిఖితపూర్వకంగా వివరాలు తెలుసుకున్నట్టు ఆమె తెలిపారు. ఉన్నత అధికారులకు నివేదిస్తామన్నారు. ఈ విషయాన్ని ఎస్‌ఐ చిరంజీవి వద్ద ప్రస్తావించగా తనకు ఫిర్యాదు రాలేదని తెలిపారు.

రైతులను ఇబ్బందిపెడితే చర్యలు: ఆర్డీవో


మిల్లర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

మెళియాపుట్టి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు నుంచి ధాన్యం అదనపు వసూళ్లకు పాల్పడుతున్న రైసు మిల్లర్లపై చర్యలు తప్పని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం చాపరలోని రైస్ మిల్లులను తనిఖీ చేశారు. చాపర మిల్లులు బ్యాంక్ గ్యారెంటీలు పూర్తికావడంతో ధాన్యాన్ని టెక్కలి ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వస్తుందని పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన ఉర్లాన వసంతరావు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు ప్రతి రైస్ మిల్లు వద్ద రెవిన్యూ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తహసీల్దార్ బి.పాపరావు ను అదేశించారు. రైస్ మిల్లుల ప్రతినిధులు టి.రమేష్, విజయ్, హరినాథ్ తదితరులు ఉన్నారు.

● ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు వేగవంత చేయాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆఫ్‌షోర్ పనులు పరిశీలించారు. చాపర వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులతో పాటు కాలువ పనులు పరిశీలించారు.

హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత


టెక్కలిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హక్కుల రక్షణ మనందరి బాధ్యత అని సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల అన్నారు. బుధవారం మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. మానవ హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ ర్యాలీలో న్యాయవాదులు చంద్రశేఖర్ పట్నాయక్, ఏజీపీ దివ్వల వివేకానంద, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ న్యాయవాది వైకుంఠరావు పాణిగ్రహి మానవహక్కులపై అవగాహన కల్పించారు. వైస్‌ప్రిన్సిపాల్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సకాలంలో చెల్లింపులు చేపట్టాలి

పాతపట్నం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు సివిల్ సప్లై అధికారులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతాంగం నుంచి సేకరించబడిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలుచేసి చెల్లింపులు వేగవంతంగా జరిగేలా చేయాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పాతపట్నం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నసాగులో ఎరువుల యాజమాన్యం పాటించాలని ఏవో కె.సింహాచలం తెలిపారు. మండల పరిధిలోని తీమర గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతాంగంతో మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం పాటించడం ద్వారానే అధిక ఆదాయాన్ని పొందవచ్చునన్నారు.

నేడు సర్వేపై వినతుల స్వీకరణ

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మెట్టూరు రెవెన్యూ పరిధిలో గల భూములకు గురువారం గునుపల్లి సచివాలయంలో రైతులు నుంచి వినతులు స్వీకరిస్తామని తహసీల్దార్ బీవీ సీతారామ్మూర్తి చెప్పారు. రీ సర్వేలో జరిగిన తప్పులు సవరణకు రెవెన్యూ అధికారులను కోరుతున్నప్పుడు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు టీడీపీ నాయకుడు జోగి తిరుపతిరావు బంగళవారం జరిగిన గ్రామసభలో ఆరోపించారు. దీనిపై పలాస ఆర్డీవో వెంకటేష్ ఆధ్వర్యంలో వినతులు స్వీకరణ చేపట్టనున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి నిధులపై హర్షం

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధి రాజాం కాలనీ నుంచి రాజాం గ్రామం మీదిగా బాతుపురం వరకు తారురోడ్డు పునర్నిర్మాణానికి రూ.2.23 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రాజాంలో మాజీ సర్పంచ్ పోతనపల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు బుల్లోజు శశిభూషన్ మాట్లాడుతూ.. గత టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ రూ.95 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆ తర్వాత వచ్చి వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అధ్వానంగా తయారైందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే గౌతు శిరీష నిధులు కేటాయించారన్నారు. మండలంలో రూ.25 కోట్లతో వివిధ గ్రామాలను కలుపుతూ 24 తారురోడ్ల నిర్మాణం చేపట్టగా వీటిలో కొన్ని ఇప్పటికే పూర్తయినట్టు చెప్పారు. నాయకులు అంబటి రామకృష్ణ, పోతనపల్లి షన్ముఖరావు, మరడ దుర్యోధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

పోలాకి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌లో పనిచేస్తున్న సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీసీసీబీ మేనేజర్‌కు బుధవారం వినతి పత్రం సమర్పించారు. డీఎల్ఎస్ఎఫ్ ద్వారా జీతభత్యాలుచెల్లించాలని, గ్రాట్యూటీ చట్టం అమలు చేయాలని, 2019, 2024 వేతన సవరణ చేపట్టాలని, ఆరోగ్య బీమా వర్తింపచేయాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

నరసన్నపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నరసన్నపేట వీఎంసీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సిల్వర్ మెడల్ సాధించినట్టు పీడీ గణపతి తెలిపారు. ఈనెల 6 నుండి 8 వరకు రాష్ట్రస్థాయిలో జరిగే అండర్-19 విభాగం సాఫ్ట్‌బాల్ ఆటలు పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన క్రీడాకారులు సిల్వర్ మెడల్ సాధించారన్నారు. అందులో ముగ్గురు విద్యార్థులు నరసన్నపేటకు చెందిన కేవీటీ పుష్ప, మెండ మోక్షప్రభ, ఎస్.సంహిత ఉన్నారన్నారు.

హక్కుల పరిరక్షణే ప్రామాణికం

పాతపట్నం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హక్కుల పరిరక్షణే ప్రజాస్వామ్యానికి ప్రామాణికమని హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి మత కుల లింగ భాష ప్రాంతీయభావాలకు ఈతీతంగా సమసమాజస్థాపన మానవ హక్కుల పరిరక్షణతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కోటి విజయ్ హేమలత ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంపల్లి హైస్కూ ఆవరణంలో అంతర్ పాఠశాలల నియోజకవర్గస్థాయి హైస్కూల్ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు హెచ్‌ఎం టి.హేమారావు, పీఈటీ గజేంద్రరావు చెప్పారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్ బాడ్మింటన్ బాలురుకు అథ్లెటిక్స్ సీనియర్, జూనియర్ విభాగంలో పోటీలు ఉంటాయన్నారు.

● పోలాకి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజవర్గస్థాయిలో గురువారం నుండి నిర్వహించనున్న గ్రిగ్స్ పోటీలకు మబగాం ఉన్నతపాఠశాల వేదికగా గుర్తించడంతో పాఠశాల పీఈటీ లక్ష్మణరావు సమీప పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయ సిబ్బందితో బుధవారం ఆటస్థలానికి సిద్ధం చేశారు. ఎంఈవో శ్రీనివాసరెడ్డి ఆటస్థలాన్ని వసతులను పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం సదాశివుని రాధాకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

సచివాలయ సిబ్బందిదే బాధ్యత

జలుమూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం చేయించే బాధ్యత గ్రామ సచివాలయ సిబ్బందిపైనే ఉందని ఎంపీడీవో బి.చిన్నమ్మడు అన్నారు. నగిరికటకం గ్రామంలో చేపడుతున్న పారిశుధ్యం పనులను బుధవారం పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యం వస్తుందని అన్ని శాఖలు అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు.

రోజుల తరబడి నిరీక్షణ

● రైతులకు తప్పని ఇబ్బందులు


రోడ్డు పక్కన ధాన్యంతో ఉన్న ట్రాక్టర్లు

ఎల్ఎన్ పేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వం హామీలిచ్చినా సంబంధిత అధికారుల ద్వారా రాజకీయ నాయకులు గ్రామాల్లో హంగామా, ఆర్భాటాలు చేయటమే తప్పా ఎలాంటి ఫలితం లేకపోతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటకు సంబంధించిన వరి ధాన్యం రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడమే కాకుండా ట్రక్కుషీటిచ్చి కేటాయించిన రైస్‌మిల్లుకు ధాన్యాన్ని ట్రాక్టర్లు, వ్యాన్ల ద్వారా తీసుకెలితేనా బస్తాలు దించేందుకు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లు యజమానులు గేటు తెరవడంలేదని రోడ్డుపైనే ట్రాక్టర్లతో నిరీక్షించాల్సి వస్తుంది. నిరంతరం వాహనాల రాకపోకలతో ఉండే అలికాం-బత్తిలి ప్రధానరోడ్డు పక్కనే ఇలా ట్రాక్టర్లను నిలిపివేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి


ఆధారాలు సేకరిస్తున్న దృశ్యం

పోలాకి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బెలమర గ్రామంలో వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దండుపాటి అప్పన్నమ్మ అలియాస్ బోడెమ్మ (68) కొన్నేళ్లుగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుంది. బోడెమ్మ భర్త చనిపోయాడు. వీరికి కుమారుడు వెంకటరమణ ఉన్నాడు. బోడెమ్మ బెలమరలోని కుమారుడి ఇంటి ఎదురుగానే నివాసం ఉంటుంది. ఇది లావుంటే బోడెమ్మ కాలికి, మెడకు గాయాలు ఉన్నాయి. దీంతో ఈమె మృతిపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోడలు అనురాధ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంజిత్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. క్లూస్ టీం పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంజిత్ పరిశీలించారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు


గంజాయితో పట్టుబడినవారితో పోలీసులు

నరసన్నపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గంజాయితో ముగ్గురిని అరెస్టు చేసినట్టు సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం బాలాసూర్ జిల్లా అనంతపూర్ గ్రామానికి చెందిన ముక్తిరంజన్ మల్లిక్, చిత్తూరు జిల్లా మదనాపురం గ్రామానికి చెందిన జల్లి శివకుమార్, ఆషారాణిదాస్ 10.4 కిలోల గంజాయితో వెళ్తుండగా.. మడపాం టోల్‌గేటు వద్ద ఎస్ఐ-2 శేఖరరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా వీరు పట్టుబడ్డారు. వీరు ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. ఒడిశాకు చెందిన ముక్తిరంజన్ మల్లిక్ బెంగుళూరు తరలిస్తుండగా, చిత్తూరుకు చెందిన జల్లి శివకుమార్, ఆషారాణిదాసు హైదరాబాదు తరలిస్తుండగా పట్టుబడినట్లు ఆయన తెలిపారు. వీరిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచినట్టు తెలిపారు.

పవిత్ర హత్యకేసులో నిందితుడి అరెస్టు

● హతురాలిది శ్రీకాకుళం జిల్లా

బౌద్ధనగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో పార్శీగుట్ట బాపూజీనగర్‌లో ఈనెల 8వ తేదీన యువతి పవిత్రను అతికిరాతకంగా హత్యచేసిన ఘటనలో నిందితుడు దుక్కా ఉమాశంకర్(24)ను వారాసిగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బౌద్ధనగర్‌లో చిలకలగూడ ఏసీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నరసయ్య, ఏసీపీ శశాంక్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన జడగ కాంతారావు, లక్ష్మీ దంపతులు పదేళ్లక్రితం నగరానికి పార్శీగుట్ట బాపూజీనగర్‌లో నివాసముంటు కూలీపనులు చేసుకుంటున్నారు. ఆ దంపతులకు ఇద్దరు కుమార్తెలు పవిత్ర(19), రేవతిలు. పవిత్ర ఇంటర్ పూర్తి చేసి కంప్యూటర్ కోర్సును నేర్చుకుంటుంది. యూసుఫ్‌గూడ రహమత్‌నగర్‌కు చెందిన దూరపు బంధువు దుక్కా ఉమాశంకర్‌తో పవిత్రకు వివాహం చేయాలని పెద్దలు నిశ్చయించారు. నిత్యం మద్యం తాగి, జులాయిగా తిరిగే ఉమాశంకర్‌ను వివాహం చేసుకోవడం పవిత్రకు ఇష్టం లేదు. ఈనెల 6వ తేదీన కాంతారావు, లక్ష్మీదంపతులు ఇద్దరు కుమార్తెలను తీసుకుని విజయవాడకు వెళ్లి తిరిగి 7వ తేదీ రాత్రి పదిగంటలకు ఇంటికి వచ్చారు. 8వ తేదీ మధ్యాహ్నం 12.15 గంటల ప్రాంతంలో మద్యం తాగి ఉమాశంకర్ పవిత్ర ఇంటికి వచ్చాడు. నాకు చెప్పకుండా విజయవాడ ఎందుకు వెళ్లారని పవిత్ర తల్లితో గొడవ పెట్టుకున్నాడు. మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో తల్లి కళ్ల ఎదుట తన వెంట తెచ్చుకున్న కత్తితో పవిత్ర గొంతులో పొడిచాడు. అనంతరం ఉమాశంకర్‌ను తన సెల్‌ఫోన్, కత్తిని అక్కడే వదిలి పారిపోయాడు. తీవ్రరక్తస్రావంతో పవిత్ర అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకున్న పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి సీసీ ఫుటేజీలు ఆధారంగా నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం పద్మారావునగర్ స్కందగిరి ఆలయం ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఉమాశంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా పవిత్రను హత్య చేసినట్లు నేరం ఒప్పుకున్నాడు. నిందితుడు ఉమాశంకర్ నుంచి రూ.1.10 లక్షల నగదు, ఫోన్, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న పోలీసులకు రివార్డులను అందజేశారు.

'ఆదిత్య' సిల్వర్ జూబ్లీ లోగో ఆవిష్కరణ


లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

టెక్కలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం లోగో ఆవిష్కరణ చేపట్టారు. సింబా యోసిస్ టెక్నాలజీస్ సీఈవో ఒ.నరేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ లోగోను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యా ప్రమాణాలు, పరిశోధన, ఆవిష్కరణల ప్రోత్సాహంతో ఆదిత్య ముందుకు నడిచిందన్నారు. అనంతరం కౌంట్‌డౌన్ రూపంలో లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, కోశాధికారి టి.నాగరాజు, కె.మధుకుమార్, డాక్టర్ రవికుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు


హిరమండలంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొత్తూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దుకాణాల్లో బుధవారం ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వేడ్‌తో తనిఖీలు చేశారు. దుకాణాల్లో మత్తు పదార్థాలు, మత్తు పానియాలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● హిరమండలం: మండల కేంద్రం హిరమండలంలోని పలు దుకాణాలను పోలీసులు జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మోడల్ టెస్ట్ పేపర్లు వినియోగించుకోవాలి

మందస/హరిపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో రూపొందించిన మోడల్ టెస్ట్ పేపర్లను పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ మందస మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు అన్నారు. మందస హైస్కూల్‌లో 130 మంది విద్యార్థులకు హెచ్‌ఎం శ్రీనివాసరావు చేతులమీదుగా వీటిని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్థిక సహకారం అందించిన వడ్డి గోపాల్, సోమనాథ్, రాజాన పరమేశ్వరరావు, మల్లికార్జునరావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పెద్దపీట

పలాస, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల్లో మహిళలకే పెద్దపీట వేస్తున్నట్టు ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. బుధవారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు మహిళలంటే ఎనలేని గౌరవమని, వారికే అన్నిరంగాల్లో మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఇ.శ్రీనివాసులు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్‌తో పాటు మహిళాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● కళింగ కోమటి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పలాసకు చెందిన జీడి వ్యాపారి, జిల్లా టీడీపీ వాణిజ్య విభాగ అధ్యక్షుడు టంకాల రవిశంకర్ గుప్తాను ఎంపిక చేయడంపై ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఆ సంఘ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అధ్యక్షుడు డోకి నాగేశ్వరరావు, కార్యదర్శి తంగుడు కామేశ్వరరావు, కోశాధికారి కోట్ని శశి, సభ్యులు మల్లా కృష్ణారావు, మల్లా సౌజన్య, టంకాల వినీల, పొట్నూరు చిరంజీవి పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన

పాతపట్నం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఖ్యాతిని భవిష్యత్తులో అంతర్జాతీయస్థాయిలో ఇనుమడింపజేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పెద్దలోగిడి గ్రామ జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న దొర లక్ష్మీప్రసన్న జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నీస్ పోటీలకు ఎంపికైన నేపథ్యంలో తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి లక్ష్మీప్రసన్నను అభినందించారు. క్రమశిక్షణ సాధన చేస్తే ఎన్నో విజయాలు సొంతం చేసుకోవచ్చున్నారు. ఈ సందర్భంగా రూ.10వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు బండి రవివర్మ, టీడీపీ నాయకులు పైల బాబ్జీ, నందిగామ ఆనందరావు,భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

వంట సిబ్బందికి మెమోలు

హిరమండలం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కోరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి బుధవారం ఎంఈవో రాంబాబు మెమోలు జాకీ చేశారు. ఇటీవల జరిగిన పేరెంట్ డే సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధ్యాహ్న భోజనం రుచిగా వండడం లేదని, నాణ్యత లోపాలు ఉన్నాయని తల్లిదండ్రులు చెప్పారని ఎంఈవో తెలిపారు. పరిసరాలు పరిశుభ్రతగా ఉంచుకోవడం లేదని చెపారన్నారు. ఈ మేరకు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని బోజన పథకం నిర్వాహకులకు మెమో జారీ చేసినట్టు తెలిపారు.

చట్టాలపై అవగాహన సదస్సు

టెక్కలి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం చట్టాలపై వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి ప్రసన్నరాణి మాట్లాడుతూ.. నవసమాజ స్థాపన బాలికా విద్యతోనే ప్రారంభమవుతుందని, ఆడ పిల్లలను చదివించడంతో పాటు వారి రక్షణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అలాగే మహిళలకు ఏ కష్టం కలిగినా 108, 100, 181, 112 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సిటీ నిలుపుదల చేయాలి

సంతబొమ్మాళి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బ్రహ్మపూర్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును కోటబొమ్మాళి రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. గతంలో ఈ రైలు పాసింజర్‌గా నడిచేదని, అప్పుడు కోటబొమ్మాళిలో నిలుపుదల చేసేవారని, కొవిడ్ తర్వాత ఈ రైలును ఇంటర్‌సిటీగా మార్చడంతో అప్పటి నుంచి ఇక్కడ నిలుపుద చేయడం లేదని దీంతో తామంతా ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ రైలు కన్నా బిజీగా ఉండే భువనేశ్వర్-విశాఖ, భువనేశ్వర్-సికింద్రాబాద్(విశాఖ) రైళ్లు ఇక్కడ నిలుపుదల చేస్తున్నారని గుర్తు చేశారు. ఇంటర్‌సిటీ రైలు నిలుపుదల చేయాలని పలుమార్లు రైల్వే అధికారులను కోరినా ఫలితం లేకపోతుందని, ఇప్పటికైనా స్పందించి ఈ ప్రాంతవాసులకు న్యాయం చేయాలన్నారు.

రేపు లే అవుట్లకు వేలం

పలాస, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ ఎంఐజీ లేఅవుట్లకు ఈ నెల 12న వేలం నిర్వహిస్తున్నట్టు సుడా అధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి వేలం నిర్వహిస్తామన్నారు. 240 గజాలు, 150 గజాల స్థలాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో పాల్గొనువారు ఒరిజినల్ ఆధార్ కార్డు, జెరాక్స్ పత్రాలు, రెండు పాస్‌పొటోలతో హాజరుకావాలనానరు.

ఆర్థిక సహాయం

నందిగాం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నందిగాం ఎంఆర్‌సీలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురైన మెసేంజర్(ఓఎస్) చుక్క మోహనరావుకు ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం అందించారు. మండల ఉపాధ్యాయ జేఏసీ అభ్యర్థన మేరకు మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు, స్థానికంగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఉదార స్వభావంతో రూ.64.100 విరాళంగా సేకరించారు. ఆ మొత్తాన్ని బుధవారం ఎంఆర్‌సీ ఆవరణలో ఎంఈవో1 జి.నర్సింహులు అందజేశారు.

కోటిసంతకాల సేకరణ

పలాస, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గం నుంచి వైసీపీ నాయకులు చేపట్టిన కోటిసంతకాల సేకరణ బుధవారంతో ముగిసింది. ఈ మేరకు వాటి ప్రతులను గవర్నర్‌కు పంపించేందుకు ప్రత్యేక వాహనానికి బుధవారం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు జెండా ఊపి ప్రారంభించారు.

● ఇచ్ఛాపురం: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైసీసీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ విజయవంతం అయిందని జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు బుధవారం లొద్దపుట్టి జంక్షన్ ప్రజా సంకల్పం స్థూపం వద్ద సమావేశం నిర్వహించారు. నాలుగు మండలాల నుంచి సేకరించిన 42 వేల సంతకాల పత్రాలను పార్టీ జిల్లా కార్యాలయానికి పంపామన్నారు.

● పాతపట్నం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో ప్రజలకు తీరని అన్యాయం జరుగుతందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. కోటి సంతకాల సేకరణ ప్రతులను శ్రీకాకుళం తరలించే కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ కేంద్రం పాతపట్నం ప్రధాన రహదారులపై చేపట్టిన ర్యాలీను పోలీసులు అడ్డుకొన్నారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.